

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 30 పుష్పం : 36 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, మల్కిపురం 29-4-99)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన భక్తికి ఏదో ఒక ఆలంబన ఉండాలి. కొంతమంది రాముడిరూపం, కొంతమంది కృష్ణుడి రూపం, అలా ఏదో ఒక రూపాన్ని, నామాన్ని తీసుకొని ఆరాధిస్తారు. సుగుణాలు ఉన్నవారు భగవంతుడిని అనుభవంలోనికి తెచ్చుకోగలరు గాని దుర్గుణాలు ఉన్నవారు భగవంతుడిని అనుభవంలోనికి తెచ్చుకోలేరు. మీరు ఏపార్టీలో ఉన్నా దేశభక్తి ముఖ్యం అలాగే మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా మీ గురువు ఎవరైనా ముముక్షత్వం ముఖ్యం. ఈ జన్మలోనే మోక్షమును పొందాలి అనే కాంక్ష ఉండాలి. దేశభక్తి లేనప్పుడు ఏ పార్టీలో ఉన్నా ఒక్కటే అలాగే నీకు ముముక్షత్వం లేనప్పుడు ఏ మార్గంలో ప్రయాణం చేసిన ప్రయోజనం లేదు. రాగద్వేషములు తగ్గించుకోవాలి. మనకు ఎప్పుడైనా రాగంకాని, ద్వేషంకాని వస్తే దానితో తాదాప్యం పొందకుండా, దానితో పేచి పెట్టుకోకుండా వేరుగా ఉండి ఆ తలంపును చూస్తూ ఉంటే రాగం వెళ్లిపోతుంది, ద్వేషం వెళ్లిపోతుంది. నరులు ఆశ్రయించదగినవాడు నారాయణుడు. ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం కేవలం, మన ప్రయత్నం వలనరాదు, భగవంతుని అనుగ్రహం కూడా ఉండాలి. విష్ణు సహస్రనామాలలో ఒకో నామం భగవంతుని యొక్క ఒకో గుణాన్ని తెలియపరుస్తుంది. శూన్యః అంటే ఏమీ లేదు అంటే భగవంతునితో పోల్చటానికి ఈ లోకంలో ఏవస్తువు లేదు అని అర్థం. వసుమనః అంటే బంగారం లాంటి మనస్సు కలవాడు అంటే ఎవరికైతే రాగద్వేషములు లేవో, అందరిపట్ల ఎవరికైతే సమానమైన ప్రేమ ఉందో వాడు బంగారం లాంటి మనస్సు కలవాడు. బంగారం లాంటి మనస్సు ఎవడికైతే ఉందో వాడు సత్పురుషుడు, జ్ఞానం వచ్చి వాడినివరిస్తుంది అని భగవంతుడు చెప్పాడు. మనకు విక్షేపదోషం ఉంటుంది. అంటే శరీరం ఎక్కడ ఉందో మనస్సు అక్కడ ఉండదు. ఉపాసనవలన విక్షేపదోషం పోతుంది. ఉపాసన అంటే అవతారపురుషుడిని గాని, మీకు ఇష్టమైన గురువుని గాని తీసుకొని నిరంతరము వారి రూపాన్ని ధ్యానించటం, వారి నామాన్ని స్మరించుకోవటం, వారిలోని సద్గుణాలను ఎంజాయ్ చేయటంవలన ఇలా వారి మీద మనస్సు నిలబెట్టి ఉంచటం వలన విక్షేపదోషం పోతుంది అంటే మనస్సు యొక్క చలనం ఆగిపోతుంది.

సత్పురుషులతో సహవాసం వలన ప్రాపంచిక విషయములతోటి సంబంధం తొలగిపోతుంది.

లోకంలో ఎన్నో ఆకర్షణలు ఉన్నాయి. ఒకో ఇంద్రియానికి ఒకో ఆకర్షణ ఉంటుంది. ఈ ఆకర్షణలనుండి బయటపడితేనే గాని మనస్సుకు అంతర్దృష్టి కలుగదు. రహస్యం అంతా మనస్సులోనే ఉంది. ఈ లోకాలను, శరీరాలను, విషయాలను సృష్టించేది మనస్సు. మనస్సు అణిగిపోతే ఏమీలేదు. కాని మనం మనస్సుతో కలిసి జీవిస్తున్నాము. మనస్సు అణిగితేనేగాని నీ హృదయంలో ఉన్న వస్తువు యొక్క స్పష్టతనీకు కోటిజన్మలు ఎత్తినా రాదు. ఎంతకాలం అయితే నీలోపల ఉన్న వాసనలు నిన్ను బాధిస్తున్నాయో, ఏ విషయాలైతే నీ ఇంద్రియాలను బయటకు ఆకర్షిస్తున్నాయో ఈ అడవిలో ఉన్నంతకాలం నీవు కోటిజన్మలు ఎత్తినాహృదయంలో ఉన్న వస్తువు యొక్క స్పష్టత నీకు తెలియదు. అది ఉందికాని దాని స్పష్టత నీకు రాదు. అది ఎప్పుడైతే స్పష్టంగా నీకు గోచరించిందో ఈ చావులు, పుట్టుకలు నుండి బయటకు వచ్చేస్తావు. నీకు సుఖం వచ్చినా, కష్టంవచ్చినా ఇది అనిత్యం అని మంత్రంలాగ అనుకోండి. వాటితో కలిసిపోవద్దు. ప్రార్థమునుబట్టి మీకు మంచిరోజులు రావచ్చు. వాటితో కలిసిపోకండి. వాటితో కలిసిపోతే మీకు అహంభావన పెరిగిపోతుంది, ఆవరణ దోషం పెరిగిపోతుంది. మంచివచ్చినా దానితో తాదాప్యం పొందవద్దు, చెడువచ్చినా దానితో తాదాప్యం పొందవద్దు. అసలు దేహమే నిజం కానప్పుడు ఇవిఎలా నిజం అవుతాయి.

మన మొఖాన్ని అద్దంలో చూసుకొంటాము. ఏదైనా మసి ఉంటే తొలగించుకొంటాము. శాస్త్రము మన మనస్సుకు అద్దంలాంటిది. మనస్సును శాస్త్రంలో చూసుకొంటే మనమనస్సులో ఏమైనా లోపాలున్నా, శాస్త్రానికి భిన్నంగా ఉన్నా ఆ లోపాలను సవరించుకోవచ్చు. అంతవరకు శాస్త్రము యొక్క ఉపయోగము. శరీరం ఉన్నంతకాలం సమాజంతో అనుబంధం తప్పదు. అది తగుమాత్రంగా ఉండాలి. అతిగా ఉంటే లోకవాసన పెరిగిపోతుంది. సాధ్యమైనంత వరకు ఇతరుల గొడవలలో కలుగజేసుకోకూడదు. ఎవరితో స్నేహం చేయాలో ఎవరితో స్నేహం చేయకూడదో అనే బుద్ధి నీకు ఉండాలి. నీ వివేకాన్ని పోగొట్టుకోవద్దు. డబ్బుపోతే మరల సంపాదించుకోవచ్చు గాని బుద్ధి చెడిపోతే మరల సద్బుద్ధిని సంపాదించటానికి కొన్ని వందల జన్మలు పట్టవచ్చు. ఇప్పుడు మనం ఎలా ఉన్నాము దేహంగా ఉన్నాము, మనస్సుగా ఉన్నాము, ఇంద్రియాలుగా ఉన్నాము, ఇష్టంగా ఉన్నాము, అయిష్టంగా ఉన్నాము మన లోపల బ్రహ్మం ఎలా ఉందో అలా లేము. లోపల బ్రహ్మం ఎలా ఉందో అలా ఉండాలంటే సంపూర్ణంగా వాసనలు నశించాలి. ఒక్క వాసన ఉన్నా పునర్జన్మ వస్తుంది. సత్పురుషులను నిరంతరము ధ్యానించటం వలన, వారి నామాన్ని స్మరించటం వలన, వారి సన్నిధిలో ఉండటంవలన వాసనలు ధ్వంసం అవుతాయి.

జీవితం అంతా తలంపులే. ఈ తలంపుల లోనుండి ఎవరైతే విడుదల పొందుతారో వారు జ్ఞాని అవుతారు. మీ మనస్సుతో మీకు ఉన్న తాదాప్యమును ఎవరైతే వదులుకున్నారో, మీ

మనస్సుమీద మీకు ఉన్న అనురాగమును ఎవరైతే వదులుకున్నారో వారు మాత్రమే స్వరూప సాక్షాత్కారమును పొందుతారు, వారికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. కోరిక ఉన్నవాడు పనిచేస్తాడు, కోరిక లేనివాడూ పని చేస్తాడు. కోరిక ఉన్నవాడు బద్ధుడవుతాడు. కోరిక లేకుండా పనిచేసిన వారు మహర్షులు అవుతారు, ముక్తిని పొందుతారు. మనకు సహనం లేదు. సహనం ఉన్నవారు బాహ్యంగా వచ్చే ఆటుపోటులకు తట్టుకొంటారు. సహనం ఉన్న వాడిని పొగిడినా, విమర్శించినా సమానంగా ఉంటాడు. సహనం లేని మనుషులు ప్రతీ చిన్న విషయానికి కంగారు పడతారు. చనిపోయే వరకు ఐడూ, ఐ ఎంజాయ్ అని ఇలా అనుకోవటం వలన సంసారం వస్తోంది. ఇలా అనుకొనేది జీవుడు. ఇవి అన్ని జీవలక్షణాలు బ్రహ్మం అలా అనుకోదు. బ్రహ్మం ఎలా ఉందో నీవు కూడా అలా ఉండగలిగితే నీవు బ్రహ్మం అవుతావు. లోకంలో సంపద చాలా ఉంది. అది అంతా నీకు రాదు. నీ దేహప్రార్థమును బట్టి ఎంత రావాలో అది వస్తుంది. నీవు అనుభవించేది కూడా నీది అని అనుకోకు ఈశ్వరుడిది అనుకొని అనుభవించు. నీ దేహప్రారబ్దమును బట్టి ఆ సంపద ఈశ్వరుడు ఇస్తున్నాడు. యజమాని ఆయనే. ఏమీ దిక్కులేని వారు మాకు దిక్కు లేదు అనుకోవద్దు. ఏమీ దిక్కులేని వారికి నారాయణుడే దిక్కు. భౌతికంగా మీకు ఏమీ సంపదలేదు అనుకోండి, మీకు భగవంతుని మీద సంపూర్ణమైన విశ్వాసం ఉంటే అది గొప్పసంపద ఎందుచేతనంటే భగవంతునిపట్ల సంపూర్ణమైన విశ్వాసం వలన లోపల ఉన్న వాసనలు నాశనం అవుతాయి. ఎవరికైతే ఆత్మజ్ఞానం కలిగిందో వారి సమక్షంలో ఉంటే, వారిని సేవించుకొంటూ ఉంటే, వారి మాటయందు గౌరవం కలిగి ఉంటే వారు ఎక్కడ ఉన్నారో ఆ హృదయం లోనికి నీవు కూడా వెళ్ళి ఐక్యమవుతావు.

కోరక యొక్క వేగం బుద్ధిలో ఉన్న వివేకాన్ని, విచక్షణను చంపేస్తుంది. కోరిక వలన భయం, దుఃఖం వస్తాయి. నీ హృదయంలో బ్రహ్మం ఉన్నప్పటికీ నీ కోరికల యొక్క వేగం వలన, నీ అలవాట్ల యొక్క వేగం వలన అది నీకు తెలియటం లేదు. నీకు ఏదైనా కోరిక ఉండాలంటే మహాత్ములతో సహవాసం కోరుకో. అదీ కోరికే గాని అది నిన్ను బాగు చేస్తుంది. శాస్త్రాలు చదవవచ్చు, మంచి పనులు చేయవచ్చు, శ్రవణాలు చేయవచ్చు ఇవి ఏమీ మహాత్ముల సాగత్యంతో సమానం కాదు. భగవంతుడిని మనం రోజూ తలపెట్టుకొంటున్నాము గాని ఆయన ఒక్కసారి మనలను తలపెట్టుకొంటే మనం పవిత్రులమవుతాము, మనం వచ్చిన పని పూర్తి అయిపోతుంది. ఎన్నిపుస్తకాలు చదివినా, ఎన్ని ప్రసంగాలు విన్నా నీకు అర్థంకాకపోవచ్చు. కాని మహాత్ముల సమక్షంలో వారి మౌనం వలన నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు ఒక్కసారి స్ఫురించవచ్చు అప్పుడు నీ జీవితం మలుపు తిరుగుతుంది. ఎన్నిజన్మలు వృధా చేసాము అని అప్పుడు నీకు అనిపిస్తుంది. జ్ఞానం అనేది ఎక్కడో బయటనుండి రాదు. సత్పురుషుల సహవాసం వలన నీ మనస్సు హృదయంలో అణగిపోతుంది. ఎక్కడయితే నీ మనస్సు అణిగిపోయిందో

అక్కడ నుండి జ్ఞానం, శాంతి ఉబికి ఉబికి వస్తుంది. పూర్వపుణ్యం మనకు లేనప్పుడు సాక్షాత్తు ఈశ్వరుడే దేహంధరించి వచ్చినప్పటికి మనకు చూడాలని అనిపించదు. దేహప్రారబ్దము యొక్క వేగం వలన అలా జరుగుతుంది. ఏ జన్మలో ఏదేహం వస్తే దానితో తాదాప్యం పొందుతాము. అదే మనం అనుకొంటాము. అదే మాయ. నేను పుట్టాను అనుకొనే వాడికి ఎవడికీ మోక్షం లేదు అంటారు భగవాన్. ఎవరు పుట్టారు దేహం పుట్టింది. నీ హృదయంలో ఉన్న వస్తువుకు పుట్టుక లేదు, చావు లేదు. నేను పుట్టాను అంటే దేహంతో నీకు తాదాప్యం ఉంది. ఇంక నీకు మోక్షం ఏమిటి? సాధన ఎందుకు అంటే పవిత్రులు అవ్వటం కోసం. నీవు పెద్ద పెద్ద సాధనలు చేయగలిగితే మంచిదే. జ్ఞానుల సమక్షంలో ఉండటంవలన అక్కడ మానసిక వాతావరణం వలన జ్ఞానం సంపాదించాలనే అపేక్ష కలుగుతుంది. అపేక్షకలగటమే కాదు జ్ఞానాన్ని పొందుతావు. మీరు బాగా చదువుకొన్నారు అనుకోండి మేము బాగా చదువుకొన్నాము లేకపోతే మీకు బాగా డబ్బు ఉంది అనుకోండి మాకు బాగా డబ్బు ఉంది లేకపోతే మా వంశం గొప్పది, మేము అందంగా ఉన్నాము అని ఇలా అనుకొంటున్నారు అనుకోండి. ఇలా చదువుతోటి, డబ్బుతోటి, వంశంతోటి, అందంతోటి తాదాప్యం పొందుతున్నారు అనుకోండి ఇవి అన్నీ అహంభావన లక్షణాలు. నీ హృదయంలో ఉన్న నిజం దేనితోనూ తాదాప్యం పొందదు. అలాగే మీరు కూడా దేనితోనూ తాదాప్యం పొందకుండా ఉంటే అదే మీరు అయిపోతారు. ఐడూ, ఐ ఎంజాయ్ ఇవి అన్ని జీవలక్షణాలు, వీటిని తగ్గించుకోండి. ఇంద్రియాలకు ఈ లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. ఆ ఆకర్షణల నుండి ఇంద్రియాలను ఉపసంహరిస్తేగాని మన శీలం పెరుగదు. ధనం పోతే తిరిగి సంపాదించుకోగలము గాని శీలంపోతే మరల సంపాదించుకోలేము. ఇంద్రియాలకు అధిపతి భగవంతుడు. ఆ భగవంతుడి అనుగ్రహం నీకు వచ్చినప్పుడు కదా ఇంద్రియ నిగ్రహం నీకు వచ్చేది. భగవంతుడిని ఆశ్రయిస్తేగాని ఇంద్రియాలు ఆకర్షణల నుండి బయటకు రావు.

దిll 28-7-99 గురుపౌర్ణమి మహోత్సవం సందర్భంగా

జిన్నూరులో సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనము

Printed and published by P.S. Rama Raju at Shriram Graphics, Palakol ☎ 24776